క్లుప్తంగా

రస్తా కోసం భూముల పరిశీలన



తంగేడుకుంట పొలాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ

ఓడీచెరువు : తంగేడుకుంట రైతులు పొలాల్లోకి వెళ్లడానికి రస్తా సౌకర్యం కల్పించాలని గతంలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్డీఓ సువర్ణ మంగళవారం తంగేడుకుంటను సందర్శించి గ్రామస్తులతో సమావేశమై చర్చించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతాచారి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ గోపీ

తనకల్లు: ప్రతి ఒక్కరూ రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని ఎస్ఐ గోపీ సూచించారు. స్థానిక జాతీయ రహదారి–42పై మంగళవారం వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్టు పెట్టుకోవాలన్నారు. వాహనానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ఒకవేళ మైనర్లకు వాహనాలు ఇచ్చి ప్రమాదాలకు గురైతే అందుకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్టు పెట్టుకోకపోతే జరిమానాలను విధిస్తామని హెచ్చరించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించినా, వేగంగా నడిపినా కేసులు నమోదు చేస్తామన్నారు.

టిడ్కో ఇళ్లు పూర్తి చేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

కదిరి టౌన్: జిల్లాలో టిడ్కో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్అండ్‌బీ అతిథి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణ పరిధిలో రెండు సెంట్లు ఇవ్వాలని కోరారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, హంద్రీ– నీవా కాలువను వెడల్పు చేసి అన్ని చెరువుల కింద పిల్ల కాలువలను ఏర్పాటు చేసి సాగునీరందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కదిరప్ప, రమణ, మహేంద్ర, మనోహర్, పవన్, శ్రీరాములునాయుడు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


19 మందికి బ్యాంకు ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతీ విద్యాసంస్థలకు చెందిన 19 మంది ఎంబీఏ ఫైనలియర్ విద్యార్థులు ఐడీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల యాజమాన్యం పేర్కొంది. ఇటీవల కళాశాలలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఐడీఎఫ్‌సీ బ్యాంకు జోనల్ హెడ్ వినోద్, రవి శేఖర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ చూపిన 19 మందికి ఆఫర్ లెటర్లు అందజేశారు. వీరికి వార్షిక వేతనం రూ.7 లక్షలు అందజేయనున్నారు. ఈ సందర్భంగా ఐడీఎఫ్‌సీ బ్యాంకు అధికారులకు కళాశాల యాజమాన్యం కృతజ్ఞతలు చెప్పారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



విద్యా సామగ్రి అందజేస్తున్న ఆర్డీఓ సువర్ణ


పుట్టపర్తి టౌన్: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆర్డీఓ సువర్ణ సూచించారు. మంగళవారం జానకిరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రిని ముఖ్య అతిథి ఆర్డీఓ సువర్ణ చేతుల మీదుగా అందజేశారు. విద్యార్థులు బాగా చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు షామీర్, హన్ను, ముబారక్, ఉపాధ్యాయులు వెంకటేష్, హరిప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

తండ్రి లక్ష్యం.. తనయుల సాకారం

- ఒకరు వైద్య విద్యలో ప్రవేశం
- మరొకరు వాలీబాల్ క్రీడలో దిట్ట
- ఒక్కో మెట్టు అధిగమిస్తూ.. ముందుకు

ప్రకృతి విపత్తులతో వ్యవసాయం అచ్చిరాలేదు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు చుట్టుముట్టాయి. చేసేదిలేక పొట్టచేత పట్టుకుని కుటుంబంతో సహా పట్టణానికి వలస వచ్చారు. కూలి పనులు చేసుకుంటూ తమ ఇద్దరు పిల్లలను బాగా చదివించారు. తల్లిదండ్రుల కష్టం, కుటుంబ నేపథ్యం గుర్తెరిగి పెద్ద కుమారుడు చదువులో రాణించాడు. నీట్‌లో మంచి ర్యాంకు సాధించి కర్నూలులో ఎంబీబీఎస్ చేరాడు. చిన్న కుమారుడు క్రీడారంగంలో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగుతున్నాడు. పిల్లలను ప్రయోజకులుగా మార్చడం ఆ రైతు ఇంట సంతోషాలను తీసుకొచ్చింది.

కదిరి టౌన్: పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం నల్లశింగయ్యగారిపల్లికి చెందిన రమణ, రమాదేవి దంపతులు. వీరిది వ్యవసాయ కుటుంబం. తమకున్న పొలంలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. అయితే ఎనిమిది, తొమ్మిదేళ్ల నుంచి పంటలు సరిగా చేతికందలేదు. అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు నష్టపోయాడు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. కొత్తగా అప్పులు పుట్టకపోవడం.. వ్యవసాయం చేసే పరిస్థితులు లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో భార్య, ఇద్దరు కుమారులతో కలిసి కదిరికి మకాం మార్చాడు. తొలు భార్యాభర్తలు కూలి పనులు చేసేవారు. కొంత కాలానికి రమణ హోటల్‌లో పనిచేస్తూ వచ్చిన సంపాదనతోనే పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సంకల్పించాడు. అందుకు అనుగుణంగానే పెద్ద కుమారుడు పి.కులశేఖర్ చదువులో ప్రతిభ కనబరుస్తూ వచ్చాడు. లేపాక్షి నవోదయలో పదో తరగతి, తిరుపతి కళాశాలలో ఇంటర్ విద్య పూర్తి చేసి.. నీట్‌లో మంచి ర్యాంకు తెచ్చుకుని కర్నూలులోని మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. ప్రస్తుతం సెకండియర్ చదువుతున్నాడు. ఇక చిన్న కుమారుడు పి.భానుతేజ స్థానిక ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. తను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 పోటీల్లో రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యాడు. గత నవంబర్ నెలలో ఉత్తర ప్రదేశ్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి ప్రశంసలు అందుకున్నాడు. పిల్లలిద్దరూ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని రమణ ఆకాంక్షిస్తున్నాడు. వారికి అవసరమైన తోడ్పాటునందించేందుకు తాను ఎంత కష్టమైనా భరిస్తానని రమణ సంతోషంగా చెబుతున్నాడు.



ఎంబీబీఎస్ చదువుతున్న పి.కులశేఖర్



వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్న భానుతేజను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్



హోటల్‌లో పనిచేస్తున్న రమణ

దాతలూ.. ముందుకు రండి



మీడియాతో మాట్లాడుతున్న రెడ్డి సంఘం నాయకులు

కదిరి: కాళసముద్రం గురుకుల పాఠశాల వద్ద రూ.11 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన రెడ్డి కల్యాణ మండపం కోసం రెడ్డి సామాజిక వర్గానికి చెందిన దాతలు ముందుకు రావాలని కదిరి రెడ్డి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయనతో పాటు ఆ సంఘం సభ్యులు వెంకటరమణారెడ్డి, బడా రవీంద్రారెడ్డి, ప్రసాద్‌రెడ్డిలు కళ్యాణ మండప నిర్మాణం వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెడ్డి సోదరుల సహకారంతో నిర్మిస్తున్న ఈ కల్యాణ మండపం పూర్తయితే దీని ద్వారా వచ్చే అద్దెలతో ఎంతోమంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన పేద విద్యార్థులను ఉన్నత చదువులు చదివించాలనేది తమ లక్ష్యమని వారు తెలియజేశారు. ఇప్పటికే దాతలు కొందరు తమవంతు సహాయ సహకారాలు అందించారని, మరింతమంది రెడ్డి సోదరులు ఆర్థికంగా సహాయం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ కళ్యాణ మండపంలో సుమారు 3 వేల మంది కూర్చునేందుకు అవకాశం ఉంటుందని, అలాగే 400కు పైగా కార్ల పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో దీన్ని నిర్మిస్తున్నట్లు వారు తెలియజేశారు. దాతలు రెడ్డి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డిని నేరుగా కానీ లేదంటే ఫోన్ (94400 17317) ద్వారా కానీ సంప్రదించి భూరి విరాళాలు అందజేసి రెడ్డి సామాజిక వర్గ పేద విద్యార్థులకు అండగా నిలవాలని కోరారు.

నాటుసారాతో ఆరోగ్యానికి ముప్పు



అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవింద నాయక్

ధర్మవరం రూరల్: నాటుసారా తాగితే ఆరోగ్యానికి ముప్పు వాటిల్లినట్లేనని ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోవిందనాయక్, ధర్మవరం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమణి తెలిపారు. మంగళవారం మండలంలోని ఓబుళనాయనపల్లి తండా, నేలకోట తండా, మల్లేనిపల్లి గ్రామాల్లో 'నవోదయం 2.0' కార్యక్రమంలో భాగంగా నాటుసారా సేవించడం వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటుసారా తాగినా, క్రయవిక్రయాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఫారెస్ట్ అధికారులు, విలేజ్ కానిస్టేబుళ్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కంటిచూపుపై అశ్రద్ధ వద్దు



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ మాధవి

ధర్మవరం అర్బన్: కంటిచూపుపై అశ్రద్ధ వహించరాదని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ప్రజలకు కంటిచూపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. సూపరింటెండెంట్ మాట్లాడుతూ గ్లకోమా వ్యాధి వల్ల కంటిలోపల పీడనం పెరిగి కంటి నరం చచ్చుపడిపోయేటట్లు చేస్తుందన్నారు. దీంతో నెమ్మదిగా కంటిచూపు తగ్గిపోతుందని తెలిపారు. 40 ఏళ్లకు పైబడిన వ్యక్తులు కంటి అద్దాలను తరచుగా మార్చవలసి రావడం, వెలుతురు చుట్టూ రంగుల వలయం కనపడటం, తరచుగా తలనొప్పితో పాటుగా కంటి ఎరుపు, వాంతులు, కనుగుడ్డు నొప్పి కలిగి ఉండటం గ్లకోమా లక్షణాలన్నారు. 35 నుంచి 40 ఏళ్ల వయసు ఉన్న ప్రతిఒక్కరూ ఈ పరీక్ష చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి అనురాధ, కంటి వైద్యనిపుణులు రాముడు, తాడిమర్రి ఆప్తాలమిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే రేషన్ సరఫరా చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

ఓడీచెరువు : కార్డుదారులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు సరఫరా చేయాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ ఓడీచెరువు మండల వ్యాప్తంగా ఉన్న ఎండీయూ వాహనాలకు నెలనెలా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తూ ఉన్నా వాహనాలు ఎక్కడా తిరగడం లేదన్నారు. కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందడం లేదన్నారు. రేషన్ షాపుల్లోకి వెళ్తే బఫర్ సమస్య ఉందని, బియ్యం సరఫరా తక్కువగా ఉందని, వచ్చినవి అయిపోయాయని సమాధానాలు చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చలపతి, పూల శ్రీనివాసులు, రత్నభాయి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం



సమావేశంలో పాల్గొన్న ఏపీయూడబ్ల్యూజే నేతలు

ధర్మవరం: ఐకమత్యంతో జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించుకుందామని ఏపీయూడబ్ల్యూజే ధర్మవరం రెవెన్యూ డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జానపాటి మోహన్, జాంపుల అజయ్‌నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని పోతుకుంట రోడ్డులోని ఎస్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే రెవెన్యూ డివిజన్ స్థాయి సమావేశం జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైరైన పాత్రికేయులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రైవేట్/కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఉచిత విద్య, ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం కల్పించేలా ప్రభుత్వం చొరవ చూపాలని సీనియర్ జర్నలిస్టులు భుజంగరావు, భావిశెట్టి, పెండేకంటి ఆంజనేయులు, వెంకటేష్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ జీవీ నారాయణ పేర్కొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్టు భుజంగరావును సన్మానించారు. కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని జర్నలిస్టులు పాల్గొన్నారు.

తగ్గిన కంది పంట దిగుబడి



కంది పంటకోత ప్రయోగం చేపడుతున్న అధికారులు

ఎన్పీకుంట: ఈ ఏడాది కంది పంట దిగుబడి 50 శాతం మేర తగ్గినట్లు పంటకోత ప్రయోగాల్లో తేలిందని మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. వంకమద్ది పంచాయతీలో మంగళవారం రైతులు రంగయ్య, ఎం.పద్మావతమ్మల పొలాల్లో సీపీఓ కార్యాలయ ఉపగణాంక అధికారి శ్రీనివాసులునాయక్ ఆధ్వర్యంలో కంది పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 28 పంటకోత ప్రయోగాలు చేపట్టామని, ఇందులో సరాసరి ఎకరాకు 1.20 క్వింటాళ్ల దిగుబడిని అంచనా వేశామని చెప్పారు. గత ఏడాది సరాసరి ఎకరాకు 2.50 క్వింటాళ్ల దిగుబడి వచ్చిస్తే.. ఈసారి 1.20 క్వింటాళ్లకు పడిపోయిందని వ్యవసాయాధికారి చెప్పారు. పంట పూత దశలో ఉన్నప్పుడు తుపాను కారణంగా చీడపీడలు, పురుగులు ఆశించడం వల్ల గణనీయంగా దిగుబడి తగ్గిందని వివరించారు. కార్యక్రమంలో సహాయ గణాంక అధికారి గంగాధర్, ఏఈఓ శిరీషా, ఏఐసీ ఇన్సూరెన్స్ అధికారులు, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యువత పోరు ర్యాలీ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైఎస్సార్ విద్యార్థి విభాగ్ నాయకులు

ధర్మవరం: నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతకు, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న అన్యాయంపై సమరశంఖం పూరిస్తూ నిర్వహించే 'యువత పోరు' ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగ్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేముల అమర్‌నాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ధర్మవరంలోని కేతిరెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బుధవారం జిల్లా నలుమూలల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులతో జిల్లా కేంద్రం పుట్టపర్తిలో ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు చెప్పారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అంతవరకు ప్రతి నెలా నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. అవుట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న వారిని తొలగించి నిరుద్యోగులుగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిది నెలలవుతున్నా నిరుద్యోగభృతి గురించి ఆలోచించలేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగభృతి చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ర్యాలీకి తరలిరండి

యువత పోరు ర్యాలీకి తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి కార్యాలయం నుంచి వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ధర్మవరం నుంచి బుధవారం ఉదయం 8 గంటలకు నిరుద్యోగులు, విద్యార్థుల తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, కేతిరెడ్డి అభిమానులు కేతిరెడ్డి క్యాంప్‌కార్యాలయం వద్దకు రావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆధ్వర్యంలో ధర్మవరం నుంచి పుట్టపర్తికి ర్యాలీగా బయల్దేరనున్నట్లు తెలిపారు.

టైల్స్ వర్కర్ అదృశ్యం


కదిరి టౌన్: పట్టణంలో ఓ టైల్స్ వర్కర్ అదృశ్యమయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా బేతంచెర్లకు చెందిన సయ్యద్‌సత్తార్ బతుకుదెరువు కోసం ఏడేళ్ల క్రితం కదిరి పట్టణానికి వచ్చాడు. సైదాపురంలోని ఓ అద్దె ఇంట్లో నివాసముంటూ టైల్స్ పనికి వెళ్లేవాడు. అయితే ఈ నెల ఏడో తేదీన ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లిన సత్తార్ తిరిగి రాలేదు. సొంతూరికి కూడా వెళ్లలేదు. దీంతో తండ్రి సయ్యద్ జమీర్ కదిరికి వచ్చి కుమారుడి అదృశ్యంపై మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలోని పిల్లవంక కాలనీ సమీపంలో మంగళవారం కోడి పందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఐ బాబ్జాన్ తన సిబ్బందితో వెళ్లి దాడులు నిర్వహించారు. అశోక్, నాగరాజు, కుమార్ అనే ముగ్గురు కోడిపందెంరాయుళ్లను అరెస్టు చేసి, వారి నుంచి రెండు కోళ్లతో పాటు రూ. 1,260 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యేక తరగతులతో తర్ఫీదు

- 17 నుంచి పదో తరగతి పరీక్షలు
- విద్యార్థులను సన్నద్ధం చేస్తున్న టీచర్లు




ప్రత్యేక తరగతుల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులు



ప్రత్యేక తరగతుల్లోని విద్యార్థులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయుడు

ధర్మవరం అర్బన్: పదో తరగతి పరీక్షలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులకు ఈ పరీక్షలు చాలా కీలకమైనవి. ఇక్కడ వచ్చే మార్కులే ఉన్నత చదువులకు మార్గనిర్దేశనం చేస్తాయి. ధర్మవరం పట్టణంలోని తొమ్మిది మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఇందు కోసం ఉదయం 8 – 9, సాయంత్రం 4.30 – 6 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠాలు బట్టీ పట్టకుండా విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు సందేహాలను నివృత్తి చేస్తున్నారు. తద్వారా వారు చదువుకున్న అంశాలను బాగా గుర్తు పెట్టుకునేలా తర్ఫీదు ఇస్తున్నారు.

విద్యార్థులకు సహకారం



పదో తరగతి విద్యార్థులకు మావంతు సహకారం అందిస్తున్నాం. వారు చదువుపై చూపుతున్న శ్రద్ధ, ఆసక్తిని గుర్తించి ప్రతి ఏటా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించేందుకు పాటుపడుతున్నాం.

– లక్ష్మీనారాయణరెడ్డి, హెచ్ఎం, సుందరయ్యనగర్, మున్సిపల్ హైస్కూల్, ధర్మవరం

వైద్యురాలికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

కదిరి అర్బన్: స్థానిక ఏరియా ఆస్పత్రిలోని వైద్యురాలికి సూపరింటెండెంట్ హుస్సేన్ మెమో జారీ చేశారు. ఆస్పత్రిలో స్కానింగ్ సౌకర్యం ఉన్నా ప్రైవేటు డయాగ్నస్టిక్ సెంటర్‌లో చేయించుకురావాలని గర్భిణులకు పంపిస్తుండడంపై 'ప్రభుత్వ డాక్టర్ అత్యాశ' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగళవారం సదరు వైద్యురాలికి మెమో జారీ చేశారు. మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని అందులో పేర్కొన్నారు.

రైతు ఆత్మహత్యపై విచారణ



గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

తనకల్లు: పూలకుంటపల్లిలో గత నెల 15న అప్పుల బాధ భరించలేక రైతు చంద్రశేఖర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై తహసీల్దార్ శోభ సువర్ణమ్మ, వ్యవసాయాధికారి శ్రీహరినాయక్ మంగళవారం గ్రామంలో విచారణ చేశారు. రైతు చంద్రశేఖర్ ఏ పంటలు చేసేవారో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. పంటల కోసం ఎక్కడెక్కడ ఎంత అప్పులు చేశారో ఆరా తీశారు. బయటి వ్యక్తుల వద్ద అప్పులు చేసి.. రాసి ఇచ్చిన ప్రాంసరీ నోట్లను పరిశీలించారు. పంటల పెట్టుబడి కోసం బ్యాంకులతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసినట్లు కుటుంబ సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయామని, ఆదుకోవాలని విన్నవించారు. రైతు చంద్రశేఖర్ ఆత్మహత్యకు గల కారణాలపై విచారణ చేశామని. నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు విచారణాధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న మక్బూల్ అహ్మద్

కదిరి అర్బన్: పట్టణంలోని 24వ వార్డులో ఉన్న మజీద్ ఏ షహమీరియాలో మంగళవారం ఇఫ్తార్ విందుకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్, రాష్ట్ర కార్యదర్శి పూల శ్రీనివాసరెడ్డి, మాజీ సమన్వయకర్త ఎస్ఎండీ ఇస్మాయిల్, లీగల్ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ లింగాల లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

యువత పోరుకు తరలిరండి

గాండ్లపెంట: కదిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో నేటి యువత పోరుకు పార్టీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని పార్టీ సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, డైరెక్టర్లు, యూత్, విద్యార్థి విభాగం నాయకులు, అభిమానులు బుధవారం ఉదయం 9 గంటలకు పుట్టపర్తికి చేరుకోవాలన్నారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం పుట్టపర్తిలో జరిగే యువత పోరు కార్యక్రమానికి మండలం నుంచి నిరుద్యోగులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆపార్టీ మండల కన్వీనర్ జోలా రామచంద్రారెడ్డి మంగళవారం కోరారు. ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పరమేశ్వరునికి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు, శివమాలధారులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నున్న కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయంలో మంగళవారం పరమేశ్వరునికి పల్లకీ సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూల పల్లకీపై పరమేశ్వరున్ని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కైపా ద్వారకనాథ్ శర్మ, శివదీక్ష మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.